నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 18 ఫిబ్రవరి 2025 | YADADRI BHUVANAGIRI

11 గంటలైనా డ్యూటీకి రాని వ్యవసాయ అధికారులు

సంస్థాన్ నారాయణపురం,ఫిబ్రవరి17 : మండల కేంద్రంలోని మండల వ్యవసాయ శాఖ కార్యలయం సిబ్బంది సమయ పాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటల వరకు అధికారులు ఒక్కరూ కూడా విధులకు హాజరుకాలేదు. వ్యవసాయ శాఖ కార్యాలయం తాళం కూడా తీయని పరిస్థితి నెలకొంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయం వద్దకు వచ్చిన రైతులకు అధికారులు ఎవరు రాకపోవడంతో గంటల తరబడి కార్యాలయం బయట ఎదరు చూసి వెళ్లిపోయారు. సమయ పాలన పాటించని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఉదయం 11 గంటల వరకు తెరుచుకోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయం

కేసీఆర్‌కు జేజేలు

ఘనంగా జన నేత జన్మదిన వేడుకలు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు
- కేక్ కటింగ్‌లు.. మొక్కలు నాటిన నేతలు
- రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ
- గుట్టలో కేసీఆర్ పేరు మీద మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పూజలు
- బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కంచర్ల హోమం
- యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద సంబురాలు
- వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు
- రక్తదానం చేసిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట కేక్ కట్ చేసి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి తినిపిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, భిక్షమయ్యగౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణాలు, పల్లెల్లో వాడవాడలా పుట్టిన రోజు సంబరాలను జరుపుకొన్నారు. ఉదయం నుంచే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. అన్నదానం చేశారు. ఆస్పత్రులు, అనాథ ఆశ్రమాల్లో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని కేసీఆర్ పేరు మీద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాదగిరిగుట్ట వైకుంఠ ద్వారం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. రాయగిరిలోని కలెక్టరేట్ ఎదుట కూడా కట్ చేశారు. భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కేసీఆర్ జన్మదినం సందర్భంగా కంచర్ల రామకృష్ణా రెడ్డి దంపతులు ఆయుష్ హోమం నిర్వహించారు. భువనగిరి పట్టణ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పండ్లు పంపిణీ చేశారు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. అక్కడి నుంచి రామలింగేశ్వర ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలేరులోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీతామహేందర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఆలేరులోని కేసీఆర్ డబుల్ బెడ్రూమ్ కాలనీ ప్రాంగణంలో మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మొక్కలు నాటారు. పోచంపల్లిలో కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంచారు. మోటకొండూరులో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు, మోటకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. చౌటుప్పల్‌లో మిషన్ భగీరథ పైలాన్ వద్ద కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట మండలంలోని చిన్నకందుకూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకుడు వినయ్ పొలాల మధ్య డ్రోన్‌తో కేసీఆర్ ఫ్లెక్సీని ఎగురవేసి అభిమానం చాటుకున్నాడు. ఆత్మకూర్(ఎం), అడ్డగూడూరు, ఆలేరు, బొమ్మలరామారం, తుర్కపల్లి, వలిగొండ, రామన్నపేట, సంస్థాన్‌నారాయణపురం మండలాల్లోనూ బీఆర్ఎస్ నాయకులు స్థానికులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు చేశారు. నల్లగొండ జిల్లాలోని దామరచర్ల మండలంలో యాదాద్రి పవర్‌ప్లాంటు వద్ద మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రం శివారులోని మెడికల్ కళాశాల ఎదుట మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి.. మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, మాజీ కంచర్ల భూపాల్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం, వృక్షార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. దేవరకొండ పట్టణంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో కేసీఆర్ సర్కారులో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కేక్ కట్ చేయడంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. మిర్యాలగూడ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య భారీ కేక్ కట్ చేశారు. అంతకు ముందు ర్యాలీగా వెళ్లి వంద పడకల ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. నకిరేకల్ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నార్కెట్‌పల్లిలో జరిగిన వేడుకల్లోనూ చిరుమర్తి పాల్గొన్నారు. హాలియాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం మొక్కలు నాటారు. రక్తదానం శిబిరాన్ని ప్రారంభించారు. భగత్ కూడా రక్తదానం చేశారు. గుర్రంపోడు మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. నందికొండలో ఎంసీ కోటిరెడ్డి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. సూర్యాపేట జిల్లావ్యాప్తంగానూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, ఎస్పీ ఆఫీస్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

చౌటుప్పల్ ప్రభుత్వ దవాఖానాలో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

ఆలేరులో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి దంపతులు

తెలంగాణ జాతిపిత కేసీఆర్

- సంక్షేమ పథకాలతో సబ్బండ వర్గాల కష్టాలు తీర్చిన మహానేత
- నేడు రాష్ట్రంలో దుర్మార్గపు పాలన
- కేసీఆర్ ఆనవాళ్లను తుడిపేయడం ఎవరి తరమూ కాదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- కేసీఆర్ పేరిట యాదగిరి గుట్టలో ప్రత్యేక పూజలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 17 : తెలంగాణ జాతిపిత, బాపూగా కేసీఆర్ జనం గుండెల్లో చెరుగని ముద్ర వేసుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం యాదగిరిగుట్ట ఆలయంలో జగదీశ్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. వెయ్యేండ్లు చరిత్రలో నిలిచిపోయే విధంగా యాదగిరిగుట్ట ఆలయాన్ని తీర్చిదిద్దిన కేసీఆర్ నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. అనంతరం కొండ కింద వైకుంఠద్వారం వద్ద భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే తప్ప ఇక్కడి సమస్యలు పరిష్కారం కావని, మన నిధులు, నియామకాలు, వనరుల కోసం పోరాటం చేసిన యోధుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రానికే తలమానికంగా యాదగిరిగుట్ట క్షేత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. సబ్బండ వర్గాల సమస్యలను గుర్తించి అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన మహానేత కేసీఆర్ అన్నారు. ఏడాది కాలంగా రాష్ట్రంలో దుర్మార్గపు పాలన కొనసాగుతున్నదని ఆందోళన వ్య2క్తం చేశారు. సమైక్య రాష్ట్రంలో కుట్రలు చేసిన వారి చేతుల్లో రాష్ట్రం ఉందన్నారు. వారు అనుకుంటున్నట్లు కేసీఆర్ ఆనవాళ్లు తుడిచేయడం ఎవరి తరమూ కాదని స్పష్టం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మళ్లీ ఆకలి చావులు, ఆత్మహత్యలు, ఫ్లోరైడ్ సమస్య మొదలయ్యారని ఆవేదన చెందారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించారు. 'సారే రావాలంటున్నది తెలంగాణ పల్లెలన్నీ' అంటూ డీజే పాటలు హోరెత్తించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు వంటేరు సురేశ్‌రెడ్డి, అవుల సాయి, ఆకుల శ్రీనివాస్, చంద్రగాని జహంగీర్, గుణగంటి బాబురావు పాల్గొన్నారు.



నకిరేకల్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



భువనగిరి పార్టీ జిల్లా కార్యాలయంలో హోమం చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

పెద్దగట్టు లింగమంతుల స్వామి దర్శనానికి బారులుతీరిన జనం

పెద్దగట్టుకు పోటెత్తిన భక్తజనం

సూర్యాపేటటౌన్/చివ్వెంల, ఫిబ్రవరి 17 : రాష్ట్రంలో రెండో అతి పెద్ద జాతర అయిన దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు రెండోరోజు సోమవారం భక్తులు పోటెత్తారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి లక్షలాదిగా భక్తులు గుట్టపైకి చేరుకున్నారు. తమ ఇష్ట దైవానికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం తెల్లవారు జామున మద్దెరపోలు, ముత్యాలపోలు, లగ్గంపోలు కార్యక్రమం నిర్వహించారు. బైకాని వారు వాయిద్యాలు వాయిస్తూ గొల్లల చరిత్రను కథల రూపంలో తెలియజేస్తూ ఆలయహక్కుదారులైన మున్న, మెంతబొయిన వారి సమక్షంలో మద్దెర పోలు నిర్వహించారు. బైకాని ప్రధాన పూజారి లింగమంతులస్వామి చౌడమ్మ గర్భగుడి ఎదుట ఉంచిన దేవర పెట్టె ముందు పసుపుతో ముగ్గులు వేశారు. ముగ్గులపై పోలుముంతలు ఉంచి, రెండు మట్టి కంచుడులో నెయ్యి, నువ్వుల నూనె పోసి దీపారాధన చేశారు. బైరవ ఆకారంలో వేసిన ముగ్గులపై కుడకలు, తమలపాకులు, నిమ్మకాయలు, జీడిగింజలు పెట్టి బైకాని వారు మైసాక్షితో హారతినిచ్చారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్‌తో పాటు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ స్వామివారిని దర్శించుకున్నారు. జంతుబలితో పెద్దగట్టు ఎరుపెక్కింది. భక్తులు ఎడ్లబండ్లను పక్కకు పెట్టి.. ట్రాక్టర్లు, జీపులు, ఇతర వాహనాలపై జాతరకు వచ్చారు. జాతరలో సెల్‌ఫోన్ సిగ్నల్ లేకపోవడంతో భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. లింగమంతుల స్వామికి బోనం సమర్పించిన మహిళలు గుడి చుట్టూ పొర్లు దండాలు పెట్టారు.

తాగునీటి సౌకర్యం లేకపోవడంతో సమీప పొలాల్లోని బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న భక్తులు

సమస్యల జాతర..

సూర్యాపేటటౌన్/ చివ్వెంల : పెద్దగట్టు లింగమంతులస్వామి జాతరకు వచ్చిన భక్తులకు సమస్యలు స్వాగతం పలికాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, డీసీఎంలలో వచ్చిన భక్తులు సుమారు 5కిలోమీటర్ల గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. వంట, స్నానాలు చేసేందుకు నీటి వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నామమాత్రంగా వాటర్ ట్యాంకులు కట్టినా అవి కాసేపట్లో ఖాళీ అయ్యాయి. కొందరు భక్తులు సమీప పొలాల్లోని బావులుఏ, బోర్ల నుంచి నీళ్లు మోసి వంట చేసుకున్నారు. అదే విధంగా వీధి లైట్లు వెలుగక భక్తులు, దుకాణాదారులు ఇబ్బందులు పడ్డారు. జాతర వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కాకుండా వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి విక్రయిస్తున్నారు. కొబ్బరి కాయల జత రూ.120కి అమ్మడంతో భక్తులు కంగు తిన్నారు. ఎగ్జిబిషన్ జేబులను గుల్ల చేస్తున్నది. తలనీలాలు సమర్పించే చోట ఒక్కో గుండుకు రూ.200 ధర నిర్ణయించారు. పెద్దగట్టు లింగన్న దర్శనానికి ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు వచ్చే క్రమంలో భక్తులను అదుపు చేయడంలో పోలీసులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

adani
Foundation
adani
Foundation

జాన్‌పహాడ్ గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్లకు అదానీ ఫౌండేషన్ పేరు

ప్రభుత్వ నిర్మాణానికి ప్రైవేట్ రంగు

- మరుగుదొడ్లకు అదానీ ఫౌండేషన్ పేరు
- సోషల్‌మీడియాలో వైరల్ అవడంతో తీయించిన అధికారులు

పాలకవీడు, ఫిబ్రవరి 17 : మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లకు ప్రైవేట్ సంస్థ పేరు రాయడంతో స్థానికులు తిరస్కరించారు. దీన్ని సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో అప్పటికప్పుడు రంగు మార్చి తప్పును సరిదిద్దుకున్నారు. జాన్‌పహాడ్ దర్గా వద్ద ప్రభుత్వం ఇటీవల రూ.కోటితో మౌలిక వసతుల కల్పనకు మరుగుదొడ్లు, సీసీ రోడ్లు వేయించింది. ఉర్సు ఉత్సవాలకు హాజరైన ఆదానీ సంస్థ అధికారులు దర్గా వద్ద మౌలిక వసతుల కల్పనకు కొంత ఆర్థికసాయం చేశారు. దీన్ని అవకాశంగా తీసుకున్న కొందరు స్థానిక నాయకులు అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లకు అదానీ సంస్థ కట్టించినట్లు పేరు పెట్టారు. దీంతో గ్రామస్తులు గమనించి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో స్థానిక నాయకుడు కల్పించుకొని మరుగుడొడ్లపై ఉన్న అదానీ సంస్థ పేరును తీయించాడు. జిల్లా అధికారులు దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దర్గా ఇన్‌స్పెక్టర్ మహమూద్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్లకు ప్రైవేట్ సంస్థ పేరు రాయించడం నిజమేనని, దాన్ని అడ్డుకొని సంస్థ పేరు తొలగించినట్లు ఆయన తెలిపారు.

సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అదానీ ఫౌండేషన్ పేరును తొలగిస్తున్న సిబ్బంది

డ్రోన్‌తో కేసీఆర్ ఫ్లెక్సీ ఎగురవేత

యాదగిరిగుట్ట : మండలంలోని చిన్నకందుకూరులో ఆ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకుడు వినయ్ వ్యవసాయ పొలం వద్ద కేసీఆర్ ఫ్లెక్సీని డ్రోన్‌తో గాలిలో ఎగురవేసి అభిమానాన్ని చాటుకున్నాడు.

KCR
HAPPY BIRTHDAY

ఆత్మకూరు(ఎం) : కేసీఆర్‌కు ఇంటిముందు వేసిన ముగ్గుతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు అరుణ

వెలుగు సిబ్బంది నిర్బంధం

- మహిళా సంఘాలను డబ్బును సొంతానికి వాడుకున్న వీబీకే
- కచలాపురంలో మహిళా సంఘాల ఆందోళన

మునుగోడు, ఫిబ్రవరి 17 : మహిళా సంఘాల పొదుపు డబ్బులను సొంతానికి వాడుకున్న వీబీకేతోపాటు వెలుగు సిబ్బందిని కచలాపురం గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. బాధితులు, అధికారులు వివరాల ప్రకారం.. మహిళ సంఘాల అభ్యున్నతి, సంఘాలకు వచ్చే సంక్షేమ పథకాలను మహిళలకు వివరించేందుకు ప్రతి గ్రామానికి ఓక వీబీకేను వెలుగు అధికారులు నియమించారు. మునుగోడు మండలంలోని కచలాపురం గ్రామంలో 18 మహిళా సంఘాలు ఉండగా, శ్రీనిధి కింద అధికారులు రూ.55లక్షలను అప్పుగా ఇచ్చారు. ఆ అప్పులు బ్యాంకులో తిరిగి చెల్లించేందుకు ప్రతి నెల గ్రామ వీబీకే పెద్దమామిడి సుఖేందర్‌కు ఆయా సంఘాలు మహిళలు అప్పజెప్పున్నారు. సుఖేందర్ మాత్రం వసూలు చేసిన డబ్బును బ్యాంకులో జమ చేయకుండా కొన్ని నెలలుగా సొంతానికి వాడుకుంటున్నాడు. బ్యాంకులో డబ్బులు కట్టిన రశీదులు ఇవ్వాలని మహిళ సంఘం సభ్యులు అడిగితే రేపు, మాపు అంటూ మాట దాట వేస్తున్నాడు. అనుమానంతో వచ్చిన మహిళ సంఘాలు సోమవారం గ్రామానికి వచ్చిన వెలుగు అధికారులతో పంచాయతీ కార్యాలయం ఆవరణలో సంఘాల రికార్డులను తనిఖీ చేయించారు. ఆయా సంఘాలు తీసుకున్న మొత్తం రూ.55లక్షలకు గాను ఇప్పటి వరకు ఇప్పటివరకు తిరిగి చెల్లించింది రూ.44.59లక్షలు కాగా, వీబీకే సుఖేందర్ 33.59 మాత్రమే బ్యాంకులో జమ చేసినట్లు తేలింది. మిగతా 11లక్షల సొంతానికి వాడుకున్నట్లు తేలడంతో మహిళ సంఘాలు సభ్యురాళ్లు వీబీకేతోపాటు వెలుగు అధికారులను గ్రామ పంచాయతీ ఆవరణలో ఉంచి తాళం వేశారు. తాము చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు వచ్చి మహిళా సంఘాలకు నచ్చచెప్పి తాళం తీసి అధికారులను బయటకు పంపించారు. వీబీకే సుఖేందర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వీబీకేను పోలీస్ స్టేషన్ తరలిస్తున్న పోలీసులు